జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 30 | అక్టోబర్ | 2026 | పేజీలు : 7



విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- అశ్వారావుపేటలో నూతన సబ్‌స్టేషన్లు, కార్యాలయ భవనాల నిర్మాణ పనులను పరిశీలించిన టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

6 లో

రాజస్థాన్ వ్యాపారస్థులపై నిఘా ఏది..?

రాజస్థాన్ వ్యాపారస్థుల వ్యాపారాలపై నిఘా ఎక్కడ అనే ప్రశ్న ఇప్పుడు మణుగూరులో హాట్ టాపిక్ గా మారింది. ప్రతి దుకాణానికి మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్ ఉందా.? ఉంటే ఏటేటా రెన్యూవల్ అవుతోందా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వినియోగదారులకు జీఎస్టీ బిల్లు ఇస్తున్నారా..? లేక జీరో బిల్లు, చేతిరాత బిల్లులతోనే వ్యాపారం నడుస్తోందా..? అనే ప్రశ్నలు ఎగసిపడుతున్నాయి. వందలాది మంది వచ్చే వాణిజ్య భవనాలకు ఫైర్ సేఫ్టీ ఎన్ఓసి ఉందా.? అగ్నిమాపక పరికరాలు ఉన్నాయా.? అనేది కూడా తేలాల్సి ఉంది. స్థానిక చిరు వ్యాపారికి ఒక న్యాయం.. వలస వ్యాపారికి మరో న్యాయమా.? అనే భావన రాకుండా అన్ని దుకాణాల్లో ఒకేసారి తనిఖీలు చేయాలని డిమాండ్ పెరుగుతోంది. ప్రజాజ్యోతి కథనాల నేపథ్యంలో అధికారులు స్పందించి మార్కెట్ లో అనుమతుల పరిశీలన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. అక్టోబర్ 29, ప్రజాజ్యోతి...
రాజస్థాన్ వ్యాపారస్థుల దుకాణంలో వస్తువు కొన్న తర్వాత దాని భవితవ్యం ఏమిటి అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. విక్రయించిన సరుకుకు రసీదుపై హామీ ముద్రిస్తున్నారా..? లేక నోటి మాటతోనే సరిపెడుతున్నారా..? అనేది అర్థం కానీ ప్రశ్నగా మిగిలింది. తీసుకున్న రెండు మూడు రోజులకే పాడైతే మార్పిడికి అవకాశం ఉందా..? మరమ్మతు సదుపాయం కల్పిస్తున్నారా..? అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. నాణ్యత లోపించిన ఉత్పత్తుల వల్ల సామాన్యుడి కష్టార్జితం వృధా...

వివరాలు 7లో..

- ప్రతి దుకాణానికి అన్ని అనుమతులు ఉన్నాయా..? ట్రేడ్ లైసెన్స్ ఉందా..? జీఎస్టీ బిల్లు కడుతున్నారా..?
- వ్యాపార బిల్డింగ్లపై ఫైర్ సేఫ్టీ ఉందా..? బిల్లు లేని విక్రయం.. భరోసా లేని సరుకు..
- స్థానిక చిరు వ్యాపారికి ఒక న్యాయం.. వలస వ్యాపారికి మరో న్యాయమా..? అధికారుల తీరుపై అనుమానాలు..!
- ప్రజాజ్యోతి కథనాలకు స్పందన.. మార్కెట్ లో అనుమతుల పరిశీలనకు డిమాండ్..!
- రాజస్థాన్ వ్యాపారాల దుకాణాలపై తనిఖీలు ఎప్పుడు..?

ఆటస్థలం ఏదీ..? అభివృద్ధి ఇదేనా!

- అశ్వాపురంలో పిల్లలకు ఆటలాడుకునే చోటు కరువు
- గుంతలు, పిచ్చిమొక్కలతో అధ్వానంగా ప్రభుత్వ కళాశాల సమీపంలోని గ్రౌండ్ ..ఆట వస్తువులు లేవు..
- వాకింగ్ చేసేందుకు వసతులు లేవు.. పట్టించుకునే వారేరీ?



అశ్వాపురం అక్టోబర్ 29,ప్రజాజ్యోతి : పిల్లలు ఆడుకోవడానికి ఆటస్థలం లేదు.. యువత క్రీడల్లో రాణించేందుకు సరైన వసతులు లేవు.. పెద్దలు, వృద్ధులు ఉదయం, సాయంత్రం నడక సాగించేందుకు అనువైన ప్రదేశం లేదు. ఇదీ అశ్వాపురం మండల కేంద్రంలో నెలకొన్న పరిస్థితి. అభివృద్ధి అంటే రోడ్లు, భవనాలు నిర్మించడమేనా? ప్రజలకు అవసరమైన ఆటస్థలాలు, క్రీడా సదుపాయాలు కల్పించడం కూడా...

వివరాలు 7లో..

భద్రాద్రికి మహర్దశ...

- గడువుకు పది రోజుల ముందే పనులు పూర్తి
- నవంబర్ 15 నుంచి రాతి కట్టడాల పనులు ప్రారంభం
- గోదావరి పుష్కరాల నాటికి ఆలయం, పట్టణానికి సరికొత్త శోభ
- ఆలయ పనులను పరిశీలించిన రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి

భద్రాచలం, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి):

భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనులను నిర్దేశిత గడువు కంటే ముందుగానే పూర్తి చేసి, గోదావరి పుష్కరాల నాటికి ఆలయం, పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పనులు ఇదే వేగంతో కొనసాగితే గడువుకు సుమారు పది రోజుల ముందుగానే పూర్తి చేయగలమని ధీమా వ్యక్తం చేశారు. గురువారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యేలు తెల్లం వెంకటరావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో కలిసి ఆలయం చుట్టూ జరుగుతున్న అభివృద్ధి, పునరుద్ధరణ పనులను మంత్రి పరిశీలించారు. ఉత్తర ద్వార దర్శనం పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

నవంబర్ 15 నుంచి రాతి కట్టడాల పనుల...
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం భద్రాద్రి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని ...

వివరాలు 7లో..

మణుగూరులో మారుతీ కార్ షోరూం దందా..!

- 14 లక్షల కారుతో కస్టమర్ కు కుచ్చుటోపీ.. గీతలు పడ్డ కారే కొత్త కార్ అంటూ మోసం..!
- కొత్త కార్ పేరుతో రంగులు మార్చిన కార్..? మారుతీ సుజుకి నెక్సలో ఓ కస్టమర్ కు ఎదురైన దారుణ అనుభవం..!
- ఏజెన్సీ అమాయకులే టార్గెట్..? సైడ్ మిర్రర్, తాళం మార్చేసి అదే గీతల కారు అంటగట్టే ప్రయత్నం..!
- ఇదిగో కార్.. అదిగో కార్ అంటూ తిప్పించి.. చివరకు గీతలు పడ్డ కారే ఇవ్వబోయరంటు బాధితుడు ఆవేదన..!
- 14 లక్షలు పెట్టి కొనుగోలు చేయాలని చూస్తే ఇంత మోసమా..? మణుగూరులో కార్ షోరూం మోసం బట్టబయలు..!
- కార్ షోరూం నిర్వాహకుల వివరణ...

మణుగూరులో కార్ కొనాలంటే ఇప్పుడు వందసార్లు ఆలోచించాల్సిన దుస్థితి నెలకొంది. కస్టమరే దేవుడు అంటూ తియ్యని మాటలు చెప్పి లోపల మాత్రం కస్టమర్లనే బకరాలను చేస్తున్నారు. ఓ సింగరేణి కస్టమర్ 14 లక్షలు అప్పు చేసి తన కలల కార్ కొందామని వెళితే గీతలు పడి, వంకర్లు పోయిన కార్ ను అంటగట్టాలని చూశారు. మణుగూరు పట్టణం లోని మారుతీ సుజుకి నెక్స షోరూంలో జరుగుతున్న ఈ దారుణ బాగోతం ఇప్పుడు బట్టబయలు అయింది. కొత్త కార్ పేరుతో గీతలు పడ్డ కార్ ఇచ్చి, కస్టమర్ అడిగితే ఇదిగో కార్, అదిగో కార్ అంటూ నెల రోజులు తిప్పించి, చివరకు అదే కార్ కు సైడ్ మిర్రర్, తాళం మార్చేసి మళ్లీ అంటగట్టబోయిన తీరు కస్టమర్ ని షాక్ కు గురిచేసింది. ఏజెన్సీ ఏరియాలో షోరూం పెట్టి అమాయక ప్రజలను టార్గెట్ చేస్తూ ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారా అనే అనుమానాలు ఇప్పుడు మణుగూరులో హాట్ టాపిక్ గా మారాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. అక్టోబర్ 29, ప్రజాజ్యోతి...

పట్టణంలోని మారుతీ సుజుకి నెక్స సంస్థలో ఓ వినియోగదారునికి అపూర్వ అనుభవం ఎదురైంది. సింగరేణి ఉద్యోగి ఓ కస్టమర్ తన స్వంత వాహనం కొనుగోలు చేయాలనే తలంపుతో ఆ షోరూంను ఆశ్రయించాడు. సంస్థ నిర్వాహకులు 14 లక్షల విలువగల వాహనాన్ని ప్రదర్శించారు. దానిని నిశితంగా పరిశీలించిన కస్టమర్ లోపాలను గుర్తించాడు. పార్శ్వ దర్పణంపై గీతలు, తాళపు చెవిపై నొక్కులు ఉన్నట్లు తేలింది. దీంతో ఆ వాహనం వద్దని, వేరొకటి ఇవ్వాలని కస్టమర్ కోరాడు. నిర్వాహకులు అంగీకరించి నూతన వాహనం తెప్పిస్తామని హామీ ఇచ్చారు. మరునాడు వాహనం వచ్చిందని కస్టమర్ కి వర్తమానం పంపారు. దీంతో కస్టమర్ వెళ్లి చూడగా అదే వాహనం కనిపించిందని ఆయన ఆరోపించారు. కేవలం దర్పణం, తాళం మార్చి అదే వాహనాన్ని ఇవ్వాలని చూశారాని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలు వెచ్చించే వినియోగదారుల పట్ల ఇది తగదని స్థానికులు అంటున్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకోని కార్ షోరూం నిర్వాహకులు భారీ మోసాలకు పాల్పడుతున్నారని స్థానికులు విమర్శలు కురిపిస్తున్నారు.

ఏజెన్సీ అమాయకులే టార్గెట్..? సైడ్ మిర్రర్, తాళం మార్చేసి అదే కారు డెలివరీ సిద్ధం..!

ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. మణుగూరు లాంటి మారుమూల ప్రాంతంలో అవగాహన తక్కువని భావిస్తున్నారా.? అంటే ఓ కస్టమర్ విషయంలో జరిగింది అదేనని తెలుస్తోంది. మొదటి రోజు చూపిన వాహనంలోని లోపాలను కప్పిపుచ్చే ప్రయత్నం ముమ్మాటికీ చేశారు. అద్దాలు మార్చి, తాళం మార్చి కొత్తదిగా చూపించి బురిడి కొట్టించారు. నిజమైన కొత్త వాహనం ఇవ్వకుండా ఇలా చేయడం పట్ల కస్టమర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పద్ధతులు మానుకోవాలని షోరూం నిర్వాహకులను స్థానికులు హెచ్చరిస్తున్నారు.

ఇదిగో కార్, అదిగో కార్ అంటూ తిప్పించి.. చివరకు గీతల కారే ఇవ్వబోయరంటు బాధితుడు ఆవేదన..!

కొత్త వాహనం వస్తుందనే ఆశతో సింగరేణిలోని ఓ కార్మికుడు రోజుల తరబడి ఎదురుచూశారు. షోరూం నుండి ఫోన్ వస్తుందని, మంచి వాహనం వస్తుందని నమ్మాడు. కానీ షోరూం వాళ్ళు ప్రతిసారీ ఇదిగో వస్తుంది, అదిగో వస్తుంది అంటూ కాలయాపన చేశారని కస్టమర్ ఆరోపించారు. చివరకు వెళ్లి చూస్తే అదే కార్ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తిప్పించే ధోరణి వల్ల తీవ్ర మనస్తాపానికి గురయ్యానని కస్టమర్ తెలిపారు. డబ్బు కట్టి కూడా ఇలా తిరగాల్సి రావడం బాధాకరమన్నారు. తనలా మరెవరూ మోసపోవద్దని కోరుకుంటు షోరూం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కస్టమర్ డిమాడ్ చేశారు.

కార్ షోరూం నిర్వాహకుల వివరణ...

ఈ కొనుగోలు విషయంపై షోరూం నిర్వాహకులు దిలీప్ ను వివరణ కోరగా గీతలు పడింది వాస్తవమే, కానీ ఎవరు మార్చారో తనకు తెలియదని చెప్పుకొచ్చారు. అయినా కార్ ఇష్టం ఉంటే తీసుకోండి లేకపోతే లేదని దురుసుగా ప్రవర్తించడం గమనార్హం. అంతేగాక కొత్తగూడెంలోని మనోహర్ అనే కార్ నిర్వాహకుడి వివరణ కూడా కోరగా ఇష్టం ఉంటే తీసుకోండి, లేదంటే మీ డబ్బులు మీకు రీఫాండ్ చేస్తామని కస్టమర్ కి చెప్పారు. మా దిలీప్ మాట్లాడింది తప్పే అంటు స్వారీ చెప్పారు. ఏది ఏమైనా కస్టమర్స్ దెగ్గర దురుసుగా ప్రవర్తించడం మంచి పద్ధతి కాదని నలుగురు హెచ్చరించారు.

అనంతుల లక్ష్మీనారాయణ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

- నిందితులు ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 29, (ప్రజాజ్యోతి)

దివంగత హెచ్.పీ గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం పాల్వంచలోని లక్ష్మీనారాయణ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి, కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, కుటుంబ సభ్యులు ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యం కోల్పోవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని అన్నారు, ఈ ఘటనకు బాధ్యులైన నిందితులు ఎవరైనా సరే చట్టం నుంచి తప్పించుకోలేరని, వారిని తప్పకుండా అరెస్టు చేయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులు చట్టపరిధిలో విధులు నిర్వర్తిస్తున్నారని, కేసు దర్యాప్తు విషయంలో చట్టప్రకారం ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. లక్ష్మీనారాయణ కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడంతోపాటు, కుటుంబ సభ్యుల అవసరాలను గుర్తించి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, వారు మనోధైర్యంతో ఉండాలని మంత్రి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, పట్టణ డీఎస్పీ సతీష్, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు ఊకంటి గోపాలరావు, తహసీల్దార్ దారా ప్రసాద్, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సుజాత, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల రంగారావు, మండల అధ్యక్షుడు భువనసుందర్ రెడ్డి, పెద్దమ్మతల్లి ఆలయ మాజీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, కార్పొరేటర్ బాలు నాయక్, పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు కాంగ్రెస్ నాయకుడు గుండు రవికుమార్, పద్మశాలి సంఘం కార్యదర్శి దోమల కిషోర్, పిండిపూలు కన్నయ్య, మానుపురి ప్రభాకర్, దానం నరసింహారావు, బొమ్మ రామకిషోర్, రామ్మూర్తి, దోమల ప్రవీణ్, శంకర్ , రాగిణి, తదితరులు పాల్గొన్నారు.

కాప్షన్ లెస్ కార్టూన్స్ పోటీలో సుభాని కార్టూన్ కు ప్రత్యేక బహుమతి

కొత్తగూడెం కలెక్టరేట్ పాల్వంచ / అక్టోబర్ 29, (ప్రజాజ్యోతి)

రాష్ట్ర స్థాయి కాప్షన్ లెస్ కార్టూన్స్ పోటీలో పాల్వంచకు చెందిన షేక్ సుభాని కార్టూన్ కు ప్రతీక బహుమతి లభించింది. పాలపర్తి రాజగోపాల్–ఉమాదేవి స్మారకార్థం ప్రముఖ హాస్య మాస పత్రిక హాస్యానందం నిర్వహించిన కాప్షన్ లెస్ కార్టూన్ పోటీలో సుభాని కార్టూన్ ప్రత్యేక బహుమతి గెలుచుకుంది. హైదరాబాద్ లోని రవీంద్ర భారతి లో బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ మాజీసలహాదారు డాక్టర్ కే.వి.రమణ కార్టూనిస్ట్ సుభాని కి నగదుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందించారు.. ఈ సందర్భంగా సుభాని ని డాక్టర్ రమణా చారి, హాస్యానందం ఎడిటర్ రాము తో పాటు పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, కవి, చిత్ర కారులు బీనిమ్, రంగస్థల నటులు సుబ్బరాయశర్మ, సత్యనారాయణ పలువురు కార్టూనిస్ట్ లు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి ఘనంగా సువర్ణ పుష్పార్చన

కొత్తగూడెం కలెక్టరేట్ ,పాల్వంచ/అక్టోబర్ 29, (ప్రజా జ్యోతి)

పాల్వంచ మండల పరిధిలోని కెపి, జగన్నాథపురం గ్రామంలో కొలువుతీరిన పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి ప్రతి గురువారం మాదిరిగా ఆలయ అర్చకులు సువర్ణ పుష్పార్చన పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా అ-ర్చకులు అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో సువర్ణ పుష్పార్చన నిర్వహించిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక హారతి,మంత్రపుష్పం,నివేదన తదితర విశేష పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎ.విజయ్‌కుమార్ ,అర్చకులు,దేవస్థాన సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు

మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు

- రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ

బూర్గంపహాడ్, అక్టోబరు 28 (ప్రజా జ్యోతి):

మండల కేంద్రం బూర్గం పహాడ్‌లో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఘనంగా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు,బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మంత్రి ఆయురారోగ్యాలతో ఉండి ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పులపల్లి సుధాకర్‌రెడ్డి,జిల్లా అధికార ప్రతినిధి పోతిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి,సర్పంచులు,ఉపసర్పంచులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యం, విద్య, భూ రీ సర్వేపై కలెక్టర్ పరిశీలన

- వైద్యులు సమయపాలన పాటించాలి
- విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి
- భూ రీ సర్వేను పటిష్టంగా నిర్వహించాలి
- సకాలంలో విధులకు హాజరుకాని మెడికల్ ఆఫీసర్కు షోకాజ్ నోటీసు జారీ

- జిల్లా కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 29, (ప్రజా జ్యోతి) : ప్రభుత్వ వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు భూ రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేయడంతో పాటు, లక్ష్మీదేవిపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి, చంద్రుగొండ మండలం సీతాయిగూడెం రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను పరిశీలించారు. రామవరం ఎంసీహెచ్ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, ఓపీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ, రక్త నమూనాల సేకరణ విధానాన్ని పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ను తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగమణి సకాలంలో విధులకు హాజరుకాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఆమెకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించిన కలెక్టర్, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సహారా సెక్యూరిటీ సంస్థకు చెందిన సంబంధిత సిబ్బందిని బ్లాక్లిస్ట్లో చేర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. అనంతరం లక్ష్మీదేవిపల్లి మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల సంఖ్య, రోజువారీ హాజరు వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో బోధనా విధానం, విద్యార్థుల అభ్యసన స్థాయులు, పాఠశాలల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులందరూ క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేలా కృషి చేయాలని తెలిపారు. అదేవిధంగా చాతకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్, అక్కడ నిర్వహించిన ఉదయం ప్రార్థనా కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. విద్యార్థులతో మమేకమై పాఠశాల వాతావరణాన్ని పరిశీలించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల హాజరు పెంపుపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.

అనంతరం చంద్రుగొండ మండలంలోని సీతాయిగూడెం రెవెన్యూ గ్రామంలో చేపడుతున్న భూ రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన సర్వే వివరాలు, సర్వే మ్యాప్లను పరిశీలించి, పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీతాయిగూడెం రెవెన్యూ గ్రామ పరిధిలో ఇప్పటివరకు 50.20 ఎకరాల విస్తీర్ణంలో రీ సర్వే పూర్తయినట్లు అధికారులు వివరించారు. గ్రామ పరిధిలో అటవీ భూముల మొత్తం విస్తీర్ణం 872.02 ఎకరాలుగా ఉందని, రోజుకు సుమారు 25 నుంచి 30 ఎకరాల విస్తీర్ణంలో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ రీ సర్వేలో భాగంగా భూముల వివరాలు, సరిహద్దులు, సర్వే మ్యాప్లను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. భూ రికార్డుల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, నిర్దేశిత ప్రణాళిక ప్రకారం సర్వే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ పర్యటనల్లో కలెక్టర్ వెంట వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాల పై పరిశీలన చేసిన డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ

- ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డాక్టర్ ప్రతాప్ ఆదేశాలు

కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్ 29, (ప్రజా జ్యోతి) కొత్తగూడెం జిల్లాలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలను డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డి ఐ ఓ డా. ప్రతాప్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయా అనే అంశాన్ని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పాలకొాయ తండా, నవభారత్ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఆర్ బి ఎస్ కే పరీక్షల కార్యక్రమాన్ని పరిశీలించి, చిన్నారుల్లో కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి అవసరమైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం బీడీకే చిట్టిరామవరం కేంద్రాన్ని సందర్శించి రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణను తనిఖీ చేశారు. కేంద్రానికి సంబంధించిన ఫిర్యాదులపై ఆరా తీసి, ప్రజలకు పారదర్శకంగా, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రం లోని డి ఈ ఐ సి, ఎస్ ఎన్ సి యు జీరో డోస్ వ్యాక్సినేషన్ విభాగాలను పరిశీలించి, చిన్నారులు, నవజాత శిశువులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. టీకాలు వేయించుకోని ప్రతి చిన్నారిని గుర్తించి వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని సూచించారు. అనంతరం గోల్లగూడెం ప్రాంతంలో నిర్వహిస్తున్న మీజిల్స్--రుబెల్లా ప్రత్యేక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. అర్హులైన ప్రతి చిన్నారికి టీకాలు అందేలా వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో అమలవుతున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని డా. ప్రతాప్ తెలిపారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, నవజాత శిశువుల సంరక్షణ, టీకా కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎస్ ఎన్ సి యు మెడికల్ ఆఫీసర్ డా. వినోద్, సిహెచ్ఓ నాగభూషణం, డిపిఓ తో పాటు సంబంధిత వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వనవాసీకి ఇన్వర్టర్, బ్యాటరీ వితరణ

చర్ల, అక్టోబర్ 29: (ప్రజా జ్యోతి): వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొమరం భీం విద్యార్థి నిలయం, శబరి బాలికా విద్యార్థి నిలయాలకు చర్లకు చెందిన జవ్వాది కుటుంబ సభ్యులు, వారి బంధుమిత్రులు అందిస్తున్న సేవలు అమోఘమని వనవాసీ కళ్యాణ పరిషత్ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత కొనియాడారు. నిరుపేద గిరిజన విద్యార్థుల అవసరాలను గుర్తించి, వారికి అవసరమైన వస్తువులను అందించడం అభినందనీయమని అన్నారు. చర్లలో బాలికల విద్య కోసం ఏర్పాటు చేసిన శబరి బాలికా విద్యార్థి నిలయానికి హైదరాబాద్కు చెందిన సాఫ్ట్వేర్ ఉద్యోగి జవ్వాది ప్రశాంత్, ఆయన స్నేహితులు కలిసి రూ. 25 వేల విలువైన ఎమరాన్ ఇన్వర్టర్, బ్యాటరీ, స్టాండ్, ఎల్ఈడీ బల్బులను వితరణగా అందించారు. ఈ సందర్భంగా శబరి బాలికా నిలయం కార్యదర్శి బందా స్వరూపరాణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆశాలత మాట్లాడారు. జవ్వాది ప్రశాంత్, ఆయన స్నేహితులు ప్రతి ఏటా కొమరం భీం విద్యార్థి నిలయానికి విరాళాలు అందించడం సంతోషకరమన్నారు. గతంలో విద్యార్థుల అవసరాల కోసం 30 ట్రంకు పెట్టెలతో పాటు రూ. 25 వేల విలువైన ఇన్వర్టర్, బ్యాటరీని అందించినట్లు తెలిపారు. ఈ ఏడాది నూతనంగా ప్రారంభించిన శబరి బాలికా విద్యార్థి నిలయానికి ఇన్వర్టర్ అవసరమని కొమరం భీం విద్యార్థి నిలయం కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ ద్వారా తెలుసుకున్న వెంటనే స్పందించి, అవసరమైన పరికరాలను అందించడం ప్రశంసనీయమన్నారు. జవ్వాది ప్రశాంత్ తల్లిదండ్రులు జవ్వాది కోదండ రాంబాబు, సుమతిరామ్ దంపతులు, ఆయన సోదరుడు శ్రీకాంత్, లావణ్య దంపతులు సైతం శబరి బాలికా నిలయం నిర్మాణం కోసం రూ. 30 లక్షల విలువైన 10 సెంట్ల స్థలాన్ని, అదనంగా రూ. 50 వేల నగదును విరాళంగా అందించారని ఆశాలత గుర్తుచేశారు. భవన నిర్మాణం పూర్తయ్యే వరకు తమ నివాసంలోనే బాలికా విద్యార్థి నిలయాన్ని ఉచితంగా నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించి తమ ఉదారతను చాటుకున్నారని తెలిపారు. తల్లిదండ్రుల అడుగుజాడల్లోనే కుమారులు, కుటుంబ సభ్యులు, వారి స్నేహితులు సేవా కార్యక్రమాల్లో ముందుకు సాగడం గర్వించదగ్గ విషయమన్నారు. నిరుపేద గిరిజన విద్యార్థుల చదువులు, అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న జవ్వాది కుటుంబం పలువురికి ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. వనవాసీ కళ్యాణ పరిషత్ నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందని ఈ సంస్థకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందదని, కేవలం దాతల సహకారంతోనే విద్యార్థి నిలయాలు నిర్వహిస్తున్నామని వివరించారు. దాతలు ముందుకు వచ్చి విద్యార్థుల చదువులకు తోడ్పాటునందించడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపాలని పిలుపునిచ్చారు. దాతల సహకారాన్ని విద్యార్థినులు ఎప్పటికీ మరువకుండా, వారి ఆశయాలకు అనుగుణంగా విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జవ్వాది మురళీకృష్ణ, వేములపల్లి ప్రవీణ్ బాబు, బుటారి సుజాత, తోలెం వరలక్ష్మి, సోడి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతను పూడ్చిన గ్రామస్థులు

చర్ల, అక్టోబర్ 29: (ప్రజా జ్యోతి): చర్ల మండలంలోని కలివేరు గ్రామంలో రహదారిపై గుంత ఏర్పడటంతో వాహనదారులు, పాదచారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని గుర్తించిన గ్రామస్థులు స్వచ్ఛందంగా స్పందించారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యగా రోడ్డుపై ఏర్పడిన గుంతను గ్రామస్థులే పూడ్చివేశారు. సంబంధిత అధికారులు స్పందించే వరకు వేచి చూడకుండా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని గుంతను పూడ్చడం పట్ల స్థానికులు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వల్లెపోగు నవీన్, రఘుబాబు, ఎన్. కోటయ్య, సరోజిని, లక్ష్మణ్ పాల్గొన్నారు.

భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- ముక్కోటి ఏకాదశి నాటికి ఉత్తర ద్వార దర్శనం పనులు పూర్తి చేయాలి
- గోదావరి పుష్కరాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
- గురుకుల విద్యార్థినులకు రూ.50 లక్షల సీఎస్ఆర్ నిధులతో 50 కంప్యూటర్ల పంపిణీ
- రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

భద్రాచలం, అక్టోబర్ 29, ప్రజా (జ్యోతి): శ్రీ సీతారామచంద్రస్వామివారి దర్శనం అనంతరం ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్‌తో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించిన మంత్రి, ముక్కోటి ఏకాదశి నాటికి ఉత్తర ద్వార దర్శనం పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఎదురయ్యే సమస్యలను సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణమే పరిష్కరించి, నిర్మాణ నాణ్యతలో రాజీ పడకుండా పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆలయ నిర్మాణ, పునరుద్ధరణ పనులను ఆగమ శాస్త్ర నియమాలకు అనుగుణంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ అంకిత్ ఆలయ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని ఘాట్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, సురక్షిత స్నానాలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పనులను నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం సీ.ఈ, ఎస్.ఓ ఈ గురుకుల కళాశాల విద్యార్థినులకు రూ. 50 లక్షల సీఎస్ఆర్ నిధులతో కొనుగోలు చేసిన 50 కంప్యూటర్లను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని విద్యార్థినులు విద్యారంగంలో మరింత రాణించేందుకు కంప్యూటర్లు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదర్ రావు, సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) డేవిడ్ రాజ్, తహసీల్దార్ రామ్ కుమార్, భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకోవాలి

ఇల్లందు, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి): పట్టభద్రులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ సూచించారు. గురువారం పట్టభద్రుడా ఓటరు నమోదు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ముత్తూట్ బ్యాంక్, డిసిసిబి, ఎస్బిఐ, పోస్ట్ ఆఫీస్, గాయత్రి బ్యాంక్, వ్యాపారులను కలిసి ఓటు నమోదు చేసుకోవాలని సూచిస్తూ, ఫామ్ 18 అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామ టాకీస్ కాంప్లెక్స్ లోని తన కార్యాలయంలో ఉచితంగా పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియ ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఇల్లందు నియోజకవర్గ బిఆర్ఎస్ కార్యాలయంలోనూ ఉచితంగా పట్టభద్రుల ఓట్లు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ రంగనాథ్, మహమ్మద్ జబ్బార్, మహమ్మద్ జాఫర్ హుస్సేన్, భానోత్ బావు సింగ్, వసంత్, శ్రీనివాస్, రాజేష్, లలిత్ కుమార్ పాసి, ముత్తయ్య, సర్దార్, ఉపేందర్ రావు, మహేష్, కిషన్ ప్రసాద్ పాసి, తుంగపల్లి మహేష్, శ్రీను, సత్యనారాయణ, మునిగంటి శివ, రామ్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

సర్వోత్తమ్ రెడ్డి గెలుపు నల్లేరుపై నడకే

- అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకే కృషి చేయాలి
- పట్టభద్రులను కలిసి ఓటు నమోదు చేయించాలి
- సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించి రామ్ రెడ్డి కుటుంబానికి కొంత రుణం తీర్చుకోవాలి
- కాంగ్రెస్ అంటేనే సంక్షేమం
- ప్రజలు ఇబ్బందులు పడే కాంగ్రెస్ పార్టీని గెలిపించారు: ఎమ్మెల్యే

ఇల్లందు, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి)

ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపు నల్లేరుపై నడకేనని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన ఇల్లందు నియోజకవర్గ పట్టభద్రులు, నాయకులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ శాసనమండలి అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పట్టభద్రులను కలిసి ఓటు నమోదు చేయించాలన్నారు. రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించి రామ్ రెడ్డి కుటుంబానికి కొంత రుణం తీర్చుకోవాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ అంటేనే సంక్షేమమని, గత పాలకుల విధానాలతో ప్రజలు ఇబ్బందులు పడే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించారని గుర్తు చేశారు. రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని పట్టభద్రుల శాసనమండలి అభ్యర్థిగా అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించి కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కానుకగా ఇవ్వాలని తెలిపారు. నవంబర్ 6 వరకు పట్టభద్రుల ఓట్లు నమోదు ప్రక్రియకు సమయం ఉన్నందున పార్టీ శ్రేణులు మరింతగా కష్టపడాలని కోరారు. ముఖ్యంగా పట్టభద్రులను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి కేవలం మొదటి ప్రాధాన్యత ఓటు చేయాలని ప్రతి ఒక్క పట్టభద్రుడిని కోరాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదాలతో కొలువుతీరిన ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా రంజక పాలన కొనసాగించడం జరుగుతుందని గుర్తు చేశారు. ప్రతి పేదవాడు సంతోషంగా ఉండేది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం లోనేనని పేర్కొన్నారు. రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి వచ్చే మెజార్టీలో ఇల్లందు నియోజకవర్గం నుంచి అధికంగా ఉండాలని, ఆ అత్యధిక మెజార్టీ కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.

పట్టభద్రుల గొంతుకనవుతా: రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల పుట్ట బిడ్డలు తనకు ఓటు వేసి గెలిపిస్తే పట్టభద్రుల గొంతుకనవుతానని కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆహ్వానం మేరకు ఇల్లందు నియోజకవర్గంలో చిన్నపాటి సమావేశం అనుకున్నానని, ఇక్కడికి వచ్చాక సమావేశం ఎమ్మెల్యే బహిరంగ సభ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. రామ్ రెడ్డి కుటుంబం ఐదు దశాబ్దాలకు పైగా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి అండగా మేమున్నామని భరోసా ఇవ్వడం జరుగుతుందన్నారు. కష్టం వచ్చినా ప్రతి ఒక్కరికీ రామ్ రెడ్డి కుటుంబం వారికి బాసటగా ఉంటుందని తెలిపారు. తన పెదనాన్న, మాజీమంత్రి రామ్ రెడ్డి వెంకట్ రెడ్డి, తన తండ్రి, మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి, ముఖ్యంగా ప్రజలకు రామ్ రెడ్డి కుటుంబంపై ఉన్న నమ్మకమే తనను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తన తండ్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి మృతి చెందాక ఇటు తుంగతుర్తి, అటు సూర్యాపేట నియోజకవర్గాలలో ప్రజలతోపాటు పార్టీ శ్రేణులకు అండగా ఉంటూ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గంలో 85 శాతం సర్పంచులను కాంగ్రెస్ పార్టీ గెలిచేందుకు తనతోపాటు పార్టీ నాయకులు, ప్రజల సహకారంతోనే సాధ్యమైందని పేర్కొన్నారు. పది సంవత్సరాలు మంత్రిగా కొనసాగిన జగదీశ్వర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ గెలుపును ఆపడం సాధ్యం కాలేదన్నారు. పైసలు తీసుకునే వ్యక్తిత్వం తనకు లేదని, ఉన్న చదువులు చదివి రామ్ రెడ్డి కుటుంబం వల్లనే ప్రజా సేవ చేసేందుకు ముందుకు రావడం జరిగిందని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలకు రామ్ రెడ్డి కుటుంబానికి గుర్తింపు ఉందని, తన తండ్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి 1969లో తెలంగాణ ఉద్యమంలో వరంగల్ కాకతీయ యూనివర్సిటీ నుండి పోరాడి జైలుకు సైతం వెళ్ళాడని గుర్తు చేశారు. తన పెదనాన్న రామ్ రెడ్డి వెంకట్ రెడ్డి, తన తండ్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి కమ్యూనిస్టు పార్టీలతో పోరాడి ప్రజలకు పార్టీకి అండగా నిలిచారని తెలిపారు. రాజకీయాల్లో వచ్చిన ప్రతి ఒక్కరూ ఆస్తులను...

రైతులు లేని సీసీఐ ప్రారంభోత్సవం!

- ఖాళీ కుర్చీల నడుమ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం..
- అధికారుల తీరుపై ఎమ్మెల్యే పాయం అసహనం

బూర్గంపహాడ్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి):

బూర్గంపహాడ్ మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో భారత పత్తి సంస్థ (సీసీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం రైతుల గైర్హాజరుతో వెలవెలబోయింది. గురువారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించిన సమయంలో రైతులు లేక కుర్చీలు ఖాళీగా దర్శనమివ్వడం చర్చనీయాంశంగా మారింది. రైతులకు ప్రయోజనం చేకూర్చాల్సిన కొనుగోలు కేంద్రం ప్రారంభ కార్యక్రమంలోనే రైతులు కనిపించకపోవడంపై ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. రైతుల నుంచి పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు కేంద్రాన్ని సిద్ధం చేసినప్పటికీ, ప్రారంభోత్సవానికి రైతులు హాజరుకాకపోవడానికి కారణాలేమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కేంద్రం ప్రారంభం గురించి రైతులకు ముందస్తుగా సమాచారం అందించారా? కొనుగోలు విధానాలు, నిబంధనలు, పత్తి నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రైతులకు సమాచారం చేరవేయడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారా అన్న చర్చ కూడా సాగుతోంది. రైతులకు ఉపయోగపడే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం స్వాగతించదగ్గ విషయమే అయినప్పటికీ, వాటి నిర్వహణలో రైతుల భాగస్వామ్యం కీలకం. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడంతోనే బాధ్యత పూర్తికాదని, పత్తి విక్రయించేందుకు వచ్చే రైతులకు అవసరమైన సమాచారం, సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. రైతులకు ముందస్తు సమాచారం అందించి, సీసీఐ కొనుగోలు నిబంధనలపై అవగాహన కల్పించి ఉంటే కార్యక్రమానికి మెరుగైన స్పందన వచ్చేదని పలువురు పేర్కొంటున్నారు.

- కొనుగోళ్లపై స్పష్టత ఇవ్వాలని రైతుల ఆకాంక్ష

పత్తి సీజన్‌లో రైతులు తమ దిగుబడులను విక్రయించేందుకు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని రైతులు కోరుతున్నారు. కేంద్రంలో కొనుగోళ్లు ఎప్పటి నుంచి ప్రారంభమవుతాయి, పత్తి నాణ్యత ప్రమాణాలేమిటి, తేమ శాతం ఎంత ఉండాలి, రైతులు తీసుకురావాల్సిన పత్రాలేమిటి వంటి అంశాలపై స్పష్టమైన సమాచారం అందించాలని సూచిస్తున్నారు. అధికారులు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లక్ష్మీపురం సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో కనిపించిన ఖాళీ కుర్చీలు అధికారుల కార్యాచరణపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి, రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటారా అన్నది వేచి చూడాలి.

ఘనంగా ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం

- వృద్ధులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి - డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారం రాథోడ్

భద్రాచలం, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో గురువారం ప్రపంచ స్ట్రోక్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ తుకారం రాథోడ్ మాట్లాడుతూ వృద్ధులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రతిరోజూ నడక, యోగా, వ్యాయామం చేయడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించాలని ఆయన తెలిపారు. గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా స్ట్రోక్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించార ు. తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భూషణ్‌రావు, కార్యదర్శి కె. మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేశారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో

విశ్రాంత ఉద్యోగుల కోసం వారానికి ఒకరోజు ప్రత్యేక వైద్య సేవలు అందించే వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్. హనుమంతరావు, వై. రామచంద్రరావు, అనసూయ, ఏ. శ్రీనివాసరావు, పాపయ్య, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేటి మండల మహాసభను విజయవంతం చేయండి

- టీఎస్ యూటీఎఫ్ భద్రాచలం మండల కమిటీ పిలుపు

భద్రాచలం, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): భద్రాచలం మండలంలో శుక్రవారం నిర్వహించనున్న టీఎస్ యూటీఎఫ్ మండల మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల కమిటీ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చింది. మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని వివిధ విద్యాసంస్థలను సందర్శించి, మహాసభకు ఉపాధ్యాయులను ఆహ్వానిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ భద్రాద్రి జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత విద్యారంగంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల సమావేశాలు, మహాసభలు కీలకమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణ రూపొందించడంలో ఇటువంటి సభలు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటాయని తెలిపారు. భద్రాచలంలోని టీఎస్ యూటీఎఫ్ భవనంలో అక్టోబర్ 30న సాయంత్రం 5 గంటలకు మండల మహాసభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భద్రాచలంలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులను ఈ మహాసభకు ఆహ్వానించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యాయుల ఐక్యత,

సంఘటిత కృషి ద్వారా సమస్యల పరిష్కారానికి ముందుకు సాగవచ్చని విజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ భద్రాచలం మండల అధ్యక్షుడు కొమరం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి.ఎస్.వి. ప్రసాద్ బాబు, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ కె. సైదులు తదితరులు పాల్గొన్నారు.

మాకు ప్రాధాన్యం ఇవ్వండి..!

- సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన సర్పంచులు - ఇందిరమ్మ ఇళ్ల జాబితాలు, పంచాయతీ నిధులపై నిరసన

ములకలపల్లి అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): తమకు ప్రాధాన్యం ఇవ్వకుండా పార్టీ నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపిస్తూ ములకలపల్లి మండల సర్పంచులు నిరసనకు దిగారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాల పంపిణీ, పంచాయతీ నిధుల వినియోగంలో జాప్యాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు. ప్రతిపక్ష సర్పంచులతోపాటు అధికారపక్షానికి చెందిన సర్పంచులు సైతం నిరసనలో పాల్గొనడం చర్చనీయాంశమైంది. పంచాయతీ నోడల్ అధికారి రమేష్‌బాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలను గ్రామ సర్పంచులకు సమాచారం ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలు, ఇందిరమ్మ కమిటీలు, పార్టీ కార్యకర్తలకు అందజేస్తున్నారని సర్పంచులు ఆరోపించారు. ఈ విషయంపై ఎంపీడీవోను ప్రశ్నించగా, కాంగ్రెస్ నాయకులకు జాబితాలు ఇచ్చినట్లు అంగీకరించారని పేర్కొన్నారు. ప్రజలచే ఎన్నికైన సర్పంచులను పక్కనపెట్టి పార్టీ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వడమేంటని ప్రశ్నించారు. పంచాయతీ ఖాతాల్లో నిధులు జమై సుమారు 50 రోజులు గడుస్తున్నా వర్క్ ఐడీల పేరుతో నిధుల వినియోగానికి అనుమతులు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని సర్పంచులు ఆరోపించారు. అధికారపక్ష సర్పంచుల పంచాయతీలకు వెసులుబాటు కల్పిస్తూ, ప్రతిపక్ష సర్పంచుల పంచాయతీల విషయంలో వివక్ష చూపుతున్నారని విమర్శించారు. కంప్యూటర్

ఆపరేటర్ల కొరత కారణంగా వర్క్ ఐడీల నమోదు, బిల్లుల తయారీలో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికై దాదాపు పది నెలలు గడుస్తున్నా అధికారులు తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని సర్పంచులు మండిపడ్డారు. గ్రామాల అభివృద్ధి పనుల్లోనూ వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాల పంపిణీ, పంచాయతీ నిధుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే అభివృద్ధి పనులను నిలిపివేసి, ప్రజలతో కలిసి మండల కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో తిమ్మంపేట సర్పంచ్ తుర్రం శ్రీనివాస్, పూసుగూడెం సర్పంచ్ బానోత్ ధర్మ, ముత్యాలంపాడు సర్పంచ్ కల్లూరు కిషోర్, పొగళ్లపల్లి సర్పంచ్ మడకం రవి, పాత గంగారం సర్పంచ్ సోడే చైతన్య, గుట్టగూడెం సర్పంచ్ వాడే రాము, ములకలపల్లి సర్పంచ్ కోర్సా చంద్రలేఖ, తాళ్లపాయి సర్పంచ్ గడ్డం సుజాత, మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి, చవిటిగూడెం సర్పంచ్ తానం పద్మ, కమలాపురం సర్పంచ్ వర్గాల రాధ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సమక్షంలో...

యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గాడి విజయ్ జన్మదిన వేడుకలు

భద్రాచలం, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి) : తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సమక్షంలో... భద్రాచలం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గాడి విజయ్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గాడి విజయ్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామ పంచాయతీ 12వ వార్డు మెంబర్ కారం దుర్గారావు, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఎండి సుభాని, యూత్ కాంగ్రెస్ మండల కార్యదర్శి మాచినేని భాను, జమిర్ తదితరులు పాల్గొన్నారు

పెన్షనర్లు తమ పాన్ కార్డు వివరాలను సరిచేసుకోవాలి

- 39 మంది సర్వీస్ పెన్షనర్లు, 238 మంది ఫ్యామిలీ పెన్షనర్ల వివరాల్లో లోపాలు

- ఆల్ పెన్షనర్స్ డివిజన్ అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు

భద్రాచలం, అక్టోబర్ 29, (ప్రజా జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, పెన్షనర్లు తమ పాన్ కార్డు వివరాలను పరిశీలించి, ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బందు వెంకటేశ్వరరావు కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీటీఓ కార్యాలయం అందించిన జాబితా ప్రకారం, జిల్లాకు చెందిన 39 మంది సర్వీస్ పెన్షనర్ల పాన్ కార్డు వివరాలు చెల్లనివిగా ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా 238 మంది ఫ్యామిలీ పెన్షనర్ల పాన్ కార్డు వివరాల్లోనూ లోపాలు ఉన్నట్లు జాబితాలో పేర్కొన్నారు. సంబంధిత పెన్షనర్లకు సమాచారం అందించేందుకు ఈ జాబితాలను సంఘం గ్రూపులో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జాబితాలో తమ పేర్లు ఉన్నవారు పాన్ కార్డు వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, తప్పులు ఉన్నట్లయితే సంబంధిత అధికారుల సూచనల మేరకు సరిచేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పెన్షనర్లు ఈ విషయాన్ని గమనించి, తమ పాన్ కార్డు వివరాలను సరిచేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని బందు వెంకటేశ్వరరావు కోరారు.

విద్యార్థినిలచే రక్షణ, చట్టపరమైన అవగాహన ప్రతిజ్ఞ

ఇల్లందు, అక్టోబర్, 29 (ప్రజా జ్యోతి) : ఇల్లందు పట్టణంలోని జెడ్పిజిహెచ్ఎస్ (గర్ల్స్ హై స్కూల్) లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వరూప కాటం ఆధ్వర్యంలో గురువారం పాఠశాల విద్యార్థినులచే రక్షణ, చట్టపరమైన అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాలలో చదువుతున్న బాలికల భద్రత, చట్టాలపై అవగాహన, ఆపద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ?ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లాకవత్ రాంబాబు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్.కె. మహమ్మద్ ఖాసిం, రిటైనర్ అడ్వకేట్ దంతాల ఆనంద్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- అశ్వారావుపేటలో నూతన సబ్‌స్టేషన్లు, కార్యాలయ భవనాల నిర్మాణ పనులను పరిశీలించిన టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 29, (ప్రజా జ్యోతి) : కొత్తగూడెం సర్కిల్ పరిధిలో విద్యుత్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసి, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కొత్తగూడెం సర్కిల్ పరిధిలోని అశ్వారావుపేట ప్రాంతంలో పర్యటించిన ఆయన, పలు విద్యుత్ సబ్ స్టేషన్లను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణం, విద్యుత్ సరఫరా విస్తరణ, నూతన కార్యాలయ భవనాల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు, సర్వే, టెండర్ ప్రక్రియలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయా పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, కొనసాగుతున్న పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

అశ్వారావుపేట–2 పరిధిలోని నందమూరి కాలనీలో నిర్మిస్తున్న 220/132 , 33/11 కేవీ నూతన సబ్‌స్టేషన్ పనులను సీఎండీ పరిశీలించారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. స్థానిక విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల కల్పనలో వేగం పెంచాలని తెలిపారు అశ్వారావుపేటలోని 220/132 కేవీ సబ్‌స్టేషన్ విద్యుత్ సరఫరా వ్యవస్థ పటిష్టతకు మౌలిక సదుపాయాల పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని ఆదనపు 33 కెవి సామర్థ్య సరఫరా కొనసాగింపు పనుల పై పలు సూచనలు చేశారు, అదేవిధంగా 33/11 కేవీ నారాయణపురం సబ్‌స్టేషన్ విద్యుత్ సరఫరా తీరుతెన్నులను పరిశీలించారు.

నూతన డివిజన్ కార్యాలయ భవన నిర్మాణానికి చర్యలు

అశ్వారావుపేటలో సుమారు 17 గుంటల విస్తీర్ణంలో ప్రతిపాదించిన నూతన డివిజన్ కార్యాలయ భవన

స్థలాన్ని సీఎండీ పరిశీలించారు. కార్యాలయ భవన నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, తదుపరి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆసుపాక 400/220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి 33 కేవీ విద్యుత్ సరఫరాకు సంబంధించిన పనులపై కూడా సీఎండీ సమీక్షించారు. ఈ పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి, సంబంధిత సాంకేతిక అంశాలను పరిశీలిస్తూ నిర్ణీత లక్ష్యాలను సాధించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు చేపట్టిన అన్ని పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు ,సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులన్నింటినీ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సీఎండీ సూచించారు. పనుల నాణ్యతలో రాజీ పడకుండా, నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో భేటీ

ఈ పర్యటన సందర్భంగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో సీఎండీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట ప్రాంతంలో విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటు, కార్యాలయ భవనాల నిర్మాణం, విద్యుత్ సరఫరా మెరుగుదలకు సంబంధించిన అంశాలపై పరస్పరం చర్చించారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవడం, సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, సరఫరా వ్యవస్థను పటిష్టం చేయడం ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చని సీఎండీ అధికారులకు సూచించారు

పాత పాల్వంచలో తాగునీటి బోరు పనులు ప్రారంభం

- ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తా

- 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి

పాల్వంచ, అక్టోబర్ 29, ప్రజాజ్యోతి: ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి అన్నారు. గురువారం పాత పాల్వంచలోని జండాల బజార్‌లో మంచి నీటి బోరు తవ్వకం పనులను ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్వాల విమలాదేవి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రజలకు తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ ఖాజామియా, కరీం, మదార్, షేక్ యాకూబ్, నజీర్, ఉమర్ అలీ, బూసి శ్రీను, చిన్నంశెట్టి హరి, కొత్వాల ఆనంద్, ముత్యాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ దెబ్బకు నేలకొరిగిన వరి పంటలు

-రైతులను ఆదుకోవాలి: సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి

ములకలపల్లి అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులకు మండలంలోని మూకమామిడి గ్రామపంచాయతీ పరిధి మొగరాలగుప్ప గ్రామంలో వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలు నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గురువారం సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారులు వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి, నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం తగిన పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కోర్సా శ్రీకృష్ణ, రైతులు కోర్సా పాపారావు, వెంకటేష్, భోగం సాయి, మడకం నవీన్, మహిళా రైతులు కోర్సా రాములమ్మ, భాను తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- కార్మికులకు జిల్లా కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్

ములకలపల్లి, అక్టోబర్ 29 ,(ప్రజాజ్యోతి): ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ పిలుపునిచ్చారు. ఈ నెల 31న శనివారం మండల కేంద్రంలోని హమాలీ అడ్డా వద్ద నిర్వహించే వేడుకల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆంగ్లేయుల పాలన కాలం నుంచి కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ పోరాడుతోందని తెలిపారు. హమాలీ కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామపంచాయతీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లు వేడుకల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. గ్రామపంచాయతీ కార్మికులు కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు.

ఫోర్జరీ సంతకాలతో భూ ఆక్రమణ

- సెక్రటరీ సంతకం ఫోర్జరీ చేశారు ఎంపీడీవో

కొత్తగూడెం కలెక్టరేట్ ,పాల్వంచ/అక్టోబర్ 29,(ప్రజా జ్యోతి)

పాల్వంచ మండలంలోని బసవతారక కాలనీ పంచాయతీలో గ్రామ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి మూడెకరాల భూమిని ఆక్రమించుకోగా అసలు పట్టేదారు ఆర్.టి.ఐ యాక్ట్ ద్వారా అసలు వాస్తవాన్ని రాబట్టుకొని మండల అభివృద్ధి అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ ఫోర్జరీ సంతకం భూ ఆక్రమణ పై సర్వత్ర చర్చ సాగుతుంది. బసవతారక కాలనీ పంచాయతీలో గల సర్వేనెంబర్ 62/70–2 లో ఎనిమిది ఎకరాలు భూమిలో మూడు ఎకరాల భూమిని ఇద్దరు వ్యక్తులు ఫోర్జరీ సంతకాల తో ఆక్రమణ చేసుకోనీ కోళ్ల ఫారం. బ్రిక్స్ ప్లాంట్ ను లీజ్ కు ఇచ్చి నట్టు అసలు పట్టే దారులు ఆరోపిస్తున్నారు. అట్టి భూమిపై ఆర్టిఐ యాక్ట్ ద్వారా అసలు వాస్తవాన్ని రాబట్టుకొని మండల అభివృద్ధి అధికారి కి ఫిర్యాదు చేసినట్లు పట్టాదారుడు బానోతు భరద్వాజ్ నాయక్ తెలిపారు. ఈ మేరకు ఎంపీడీవో రాజారావు క్షేత్రస్థాయిలో విచారించి రికార్డులను పరిశీలించారు. 2005లో గ్రామపంచాయతీ తీర్మానం లేదని తేల్చి చెప్పారు. గ్రామ కార్యదర్శి అజ్మీర రాంబాబును పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయమని ఆదేశించారు. కార్యదర్శి పాల్వంచ రూరల్ స్టేషన్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారని కేశవాపురం గ్రామానికి చెందిన బానోతు వీరన్న. రామ్ జి. లు పై ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ ఫోర్జరీ సంతకాల భూ ఆక్రమణ లో ఓ మాజీ ప్రజా ప్రతినిధి ఉన్నట్లు చర్చ జరుగుతుంది. తమ భూమి తమకు ఇప్పించాలని అసలు పట్టేదారులు రెవెన్యూ పోలీస్ శాఖల చుట్టూ తిరుగుతున్నారు.



తేది : 19.10.2026

అయ్యా!

Received on 19.10.2026, at 14:00hrs

As per the contents of the above petition, I registered a case in Cr.No: 146/2026, U/s. 318(4), 336(3), 340(2) BNS and took up the investigation.

19/10/2026

SI, Palvancha Rural PS

(అజ్మీర రాంబాబు).

సెల్ నెంబర్ : 9912010654

రాజస్థాన్ వ్యాపారస్థులపై నిఘా ఏది..?

(మొదటీ పేజీ తరువాయి)

అవుతోందని పలువురు ఆవేదన చెందుతున్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణకు అధికారులు చొరవ చూపి, విక్రయానంతర సేవలపై కూడాదృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అనుమతుల మాయాజాలం.. తనిఖీలకు డిమాండ్..!

మణుగూరు ప్రధాన మార్కెట్ లోని వాణిజ్య దుకాణాల అనుమతులపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ప్రతి దుకాణానికి మున్సిపల్ వాణిజ్య అనుమతి తప్పనిసరి కాగా, ఆ అనుమతి ఏటేటా పునరుద్ధరణ అవుతోందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. వాణిజ్య నిర్వహణకు సంబంధించి పంచాయతీ, మున్సిపల్ నిబంధనలను పాటిస్తున్నారా అనేది క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. అనుమతులు లేకుండా వ్యాపారం సాగితే ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని స్థానికులు అంటున్నారు. అందుకే అధికారులు వెంటనే అన్ని దుకాణాల లైసెన్స్ లను బహిరంగంగా పరిశీలించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనల అమలులో జాప్యం జరిగితే స్థానిక చిరు వ్యాపారులకు అన్యాయం జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జీఎస్టీ బిల్లు ఇస్తున్నారా..? వస్తువుల భరోసా ఎక్కడ..?

రాజస్థాన్ వ్యాపారస్థుల దుకాణాలలో వస్తువు కొనుగోలు చేసిన తర్వాత వినియోగదారునికి

అందాల్సిన గ్యారెంటీ బిల్లు అందుతోందా అనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. జీఎస్టీ చట్టం ప్రకారం ప్రతి విక్రయానికి పక్కా బిల్లు ఇవ్వడం తప్పనిసరి. కానీ కొన్ని చోట్ల చేతిరాత బిల్లులు, అంచనా చీటీలతోనే వ్యాపారం సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బిల్లు లేకపోతే కొనుగోలు చేసిన సరుకుకు గ్యారెంటీ లేకుండా పోతోందని, మూడు రోజులకే పాడైతే ఎవరిని అడగాలో తెలియడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు మార్కెట్ లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, బిల్లులు ఇవ్వని దుకాణాలను గుర్తించాలని, వినియోగదారుల హక్కులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అగ్నిమాపక భద్రత గాలికి.. వాణిజ్య భవనాల్లో ఫైర్ సేఫ్టీ ఏది..?

మణుగూరులోని పెద్ద వాణిజ్య భవనాలు, హార్డ్ వేర్, ఫర్నీచర్ దుకాణాల్లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వందలాది మంది రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఫైర్ ఎన్ఓసి, ఫైర్ ఎక్స్ టింగ్విషర్లు, అత్యవసర ద్వారాలు తప్పనిసరిగా ఉండాలి. కానీ క్షేత్రస్థాయిలో ఈ భద్రతా చర్యలు కనిపించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఒకవేళ ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది అనే ప్రశ్న తలెత్తుతోంది. షాప్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్, తూనికలు కొలతల శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని, భద్రతా ప్రమాణాలు లేని భవనాలకు నోటీసులు జారీ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే పరిస్థితి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆటస్థలం ఏదీ..? అభివృద్ధి ఇదేనా!

అశ్వాపురం అక్టోబర్ 29,ప్రజాజ్యోతి :
పిల్లలు ఆడుకోవడానికి ఆటస్థలం లేదు.. యువత క్రీడల్లో రాణించేందుకు సరైన వసతులు లేవు.. పెద్దలు, వృద్ధులు ఉదయం, సాయంత్రం నడక సాగించేందుకు అనువైన ప్రదేశం లేదు. ఇదీ అశ్వాపురం మండల కేంద్రంలో నెలకొన్న పరిస్థితి. అభివృద్ధి అంటే రోడ్లు, భవనాలు నిర్మించడమేనా? ప్రజలకు అవసరమైన ఆటస్థలాలు, క్రీడా సదుపాయాలు కల్పించడం కూడా అభివృద్ధిలో భాగమే కదా! అయినప్పటికీ ఈ అంశంపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గ్రౌండ్ ఉన్నా.. ఉపయోగం శూన్యం!

అశ్వాపురం ప్రభుత్వ కళాశాల సమీపంలో గ్రౌండ్ ఉన్నప్పటికీ అది ఉన్నట్టా.. లేనట్టా అన్న చందంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మైదానం మొత్తం గుంతలు, బొక్కలతో పాటు పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో ఆటలాడుకోవడానికి అనుకూలంగా లేకుండా పోయింది. కనీసం మైదానాన్ని చదును చేసి, ఆటలకు అనువుగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టకపోవడం బాధాకరమని ప్రజలు అంటున్నారు. ఉపయోగంలోకి తీసుకురావాల్సిన గ్రౌండ్ నిరుపయోగంగా ఉండటంతో పిల్లలు, యువతకు క్రీడా అవకాశాలు దూరమవుతున్నాయి.

పిల్లల భవిష్యత్తుపై నిర్లక్ష్యమెందుకు?

చిన్నతనం నుంచే పిల్లలకు ఆటలపై ఆసక్తి పెంపొందిస్తే శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం కూడా మెరుగుపడుతుంది. క్రీడలు పిల్లల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి. ప్రతిభ ఉన్న పిల్లలకు సరైన మైదానం, అవసరమైన ఆట వస్తువులు అందుబాటులో ఉంటే వారు జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించే అవకాశాలు ఉంటాయి. కానీ అశ్వాపురంలో కనీస క్రీడా సదుపాయాలు లేకపోవడం వల్ల పిల్లలు తమకు నచ్చిన ఆటలు ఆడుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఇప్పటికైనా అధికారులు స్పందించి మైదానాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధులకు వాకింగ్ చేసేందుకు స్థలమేదీ?

ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉదయం, సాయంత్రం నడక సాగించడం ఎంతో ముఖ్యం. ముఖ్యంగా వృద్ధులు, మధ్యవయస్కులు ప్రశాంతమైన వాతావరణంలో నడవడానికి ప్రత్యేక స్థలం అవసరం. అయితే అశ్వాపురం మండల కేంద్రంలో ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా వాకింగ్ ట్రాక్, ఇతర సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. మైదానాన్ని అభివృద్ధి చేస్తే పిల్లలకు ఆటస్థలంగా, యువతకు క్రీడా ప్రాంగణంగా, వృద్ధులకు వాకింగ్ స్థలంగా ఉపయోగపడుతుంది. అయినా ఈ దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి అంటే ఇదేనా?

ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మైదానాలు, ప్రజలకు ఉపయోగపడే బహిరంగ ప్రదేశాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. అశ్వాపురం వంటి మండల కేంద్రంలో ఒక గ్రౌండ్ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేకపోవడం పాలకుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే అభివృద్ధికి సార్థకత చేకూరుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు

సంబంధిత అధికారులు ప్రభుత్వ కళాశాల సమీపంలోని గ్రౌండ్ను పరిశీలించి, గుంతలను పూడ్చి, పిచ్చిమొక్కలను తొలగించి మైదానాన్ని చదును చేయాలని ప్రజలు కోరుతున్నారు. పిల్లల కోసం అవసరమైన ఆట వస్తువులు ఏర్పాటు చేయడంతో పాటు యువత క్రీడలకు అనువైన వసతులు, వృద్ధులు నడవడానికి వాకింగ్ ట్రాక్ కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పిల్లలకు ఆటస్థలం, యువతకు క్రీడా ప్రాంగణం, వృద్ధులకు వాకింగ్ ట్రాక్ కల్పించడం అధికారులకు పెద్ద పనేమీ కాదు. ఉన్న గ్రౌండ్ను అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దడమే ఇప్పుడు ప్రధాన అవసరం. మరి అశ్వాపురం గ్రౌండ్ అభివృద్ధిపై అధికారులు ఎప్పుడు దృష్టి సారిస్తారు? ప్రజల సమస్యకు ఎప్పుడు పరిష్కారం చూపుతారు? అన్నది వేచి చూడాలి.

భద్రాద్రికి మహర్దశ...

(మొదటీ పేజీ తరువాయి)

మంత్రి తెలిపారు. ఆర్అండ్బీ, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ప్రతి వారం సమీక్షలు నిర్వహిస్తూ పనులను వేగవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని స్లాబుల నిర్మాణ పనులు పూర్తయ్యాయని, నవంబర్ 15 నుంచి రాతి కట్టడాల నిర్మాణం ప్రారంభించి, వాటిని క్షేత్రస్థాయిలో ప్రతిష్ఠించే ప్రక్రియ చేపడతామని వెల్లడించారు. మిగిలిన కాంక్రీట్ పనులతో పాటు మాడవీధుల పనులను సమాంతరంగా కొనసాగిస్తామని చెప్పారు. ఆలయం ఒకవైపు, నివాస ప్రాంతాలు మరోవైపు ఉండటంతో కొండపై రాతిని తొలగించే పనులను అత్యంత జాగ్రత్తగా చేపడుతున్నామని వివరించారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, నిర్మాణ నాణ్యతలో రాజీ పడకుండా పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రాజెక్టు కోసం అధికారులు, సిబ్బంది రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని అభినందించారు.

బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయ పర్యాటక మార్గం ..

బాసర నుంచి భద్రాచలం వరకు ప్రధాన ఆలయాలను అనుసంధానిస్తూ ప్రత్యేక ఆలయ పర్యాటక మార్గాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి తెలిపారు. గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలంతో పాటు మార్గంలోని ఇతర ఆలయాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఘాట్ల నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వెల్లడించారు.

పట్టణ డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు చర్యలు...

భద్రాచలం పట్టణంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా సులభంగా బయటకు వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే ముఖ్యమంత్రి, ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. డ్రైనేజీ పనులకు సంబంధించిన అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామని, వాటిని కూడా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆలయ అభివృద్ధితో పాటు పట్టణాన్ని సమగ్రంగా తీర్చిదిద్ది, గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఆర్అండ్బీ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి బైరు వెంకటేశ్వర్లు ఆశయాలను సాధించాలి

సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు

ములకలపల్లి అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): అమరజీవి బైరు వెంకటేశ్వర్లు ఆశయాలను సాధించే దిశగా ప్రజా పోరాటాలను నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు పిలుపునిచ్చారు. గురువారం ములకలపల్లిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సీపీఎం సీనియర్ నాయకుడు బైరు వెంకటేశ్వర్లు ఆరో వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో తొలితరం కమ్యూనిస్టు నాయకుల్లో ఒకరిగా బైరు వెంకటేశ్వర్లు నిలిచారని తెలిపారు. యువకుడిగా ఉన్నప్పుడే పార్టీలో చేరి, చివరి వరకు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి అనేక పోరాటాల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. సొసైటీ డైరెక్టర్గా రైతులకు అందుబాటులో ఉంటూ, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడారని గుర్తుచేశారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. వెంకటేశ్వర్లు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తూ, ప్రజా సమస్యలపై పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపగాని లక్ష్మీనరసయ్య, బైరు ప్రసాద్, గడ్డం వెంకటేశ్వర్లు, కాంతారావు, గంగరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.